# నిజాయితీ




ఈరంకి వెంకటరావు

కొంతమంది వ్యక్తుల్లో విపరీతమైన నమ్మకం వుంటుంది. అలాగని వారు ప్రతివ్యక్తినీ నమ్ముతారని కాదు. కొంత మంది వ్యక్తులతో పరిచయం పెంచు కొన్నాక, వారి వ్యక్తిత్వంలో ఆకర్షణ వంటి నమ్మకం ఏర్పడిన తర్వాత ఆ నమ్మకం, ఆకర్షణ అంత త్వరగా సడలిపోదు ఆ విధంగా నమ్మినందుకు కొన్ని పరిస్థితులలో వారు యిబ్బందులకు గురికావడం, ఎదటివారిచే హేళన పొందటం జరుగుతుంది తమ నమ్మకానికి తమ మనస్సే ప్రధానంగాని, ఆ మనస్సును విప్పి చూపించడం ఎలా సాధ్యమవుతుంది? తాము మినహా యితరు లందరూ నిజాయితీపరులు కారు, ముఖ్యంగా డబ్బు విషయంలో అనే దృఢమైన అభిప్రాయం కలవాళ్ళని నమ్మించడం మరీ కష్టం సరిగ్గా యిటు వంటి విషమ సమస్యకే గురిఅయ్యాడు సుందర్రావు.

మూడురోజుల బట్టి అదే పనిగా వర్షం కురుస్తోంది, పగబట్టినట్టు. ఈచెట్టు మీద పక్షి ఆ చెట్టుమీద వాలడంలేదు. ఏ పూట కాపూటే వర్షం తగ్గుతుందేమో నని కనిపెట్టుకు కూర్చుని సుందర్రావు మూడురోజుల ప్రయాణం ఆపుజేస్తూ, అలస్యంచేస్తూ వున్నాడు. తన భార్య జగదాంబ తనకి పురమాయించిన పని మీద, వర్షం ఆరంభం కాకముందే వెళ్ళి వుండవలసింది. ఇరవై మైళ్ళ దూరంలో వున్న వూరు వెళ్ళి ఆ పని చేసుకుని రాలేకపోతామా అన్న ధీమామీద అలాగే బద్ధకించాడు. ఈలోగా వర్షం పగబట్టి నట్టు కురవడం అరంభించింది. వర్షానికి రూపకల్పన చేసి, అంటే మానవ రూప కల్పనచేసి దానికి బుద్ధిలేదనుకున్నాడు సుందర్రావు. వర్షం ఎప్పుడూ అవసర మైనప్పుడు రాదు, అక్కర లేనప్పుడు ఆగిపోదు.

సుందర్రావుకి వర్షం బాగా తగ్గిపోవా లని వుంది. కాని తగ్గలేదు ఇక విధిలేక అలాగే ప్రయాణానికి నడుముకట్టాడు. తాను వెళ్ళవలసిన వూరికి పద్దెనిమిది మైళ్ళు బస్సు ప్రయాణం; రెండు మైళ్ళు కాలిబాటమీదగాని, బండిమీదగాని వెళ్ళాలి. అదృష్టవశాత్తు ఏ రెండెడ్ల బండైనా దొరికితే, దానిమీద కూర్చొని ప్రయాణం చెయ్యగలిగిన ఓపిక వుండాలిగాని, నడవ నక్కరలేకుండా కొత్తకోట చేరుకో వచ్చు. ఈ నడక ప్రయాణమే అతనిని వర్షానికి పూర్వం, వర్షం ఆరంభమైన తర్వాత గూడా బద్ధకించేలాగ చేసింది. పోనీ తాను వెళ్ళవలసిన పని ఎవరికైనా పురమాయించి చేయించుకుందామా అంటే అది అలాగ యితరులకు అప్పగించే పనికాదు; తనే స్వయంగా వెళ్ళాలి.

జగదాంబ సుందర్రావును అప్పుడే వారంరోజుల నుంచి పోరుతూవుంది - తనపేర ఉన్న ప్రామిసరీ నోటు పట్టు కొని వెళ్ళి బుచ్చిరామయ్యగారిని డబ్బు

గట్టిగా అడగి వసూలుచెయ్యమనీ, ఆయన ఇవ్వకపోతే దావా చెయ్యమనీ.

బుచ్చిరామయ్యగారు పెద్ద గృహస్థు. మంచివాడుగా అందరికీ తెలుసు అవసర మొస్తే ఆయన నోటుమీద కాకుండా నోటిమాటమీదే కొన్ని వేలు అప్పు తేగలడు. ఆయన అంత మాటపలుకుబడి వున్నవాడు. ఉచ్ఛితమైన మనిషి అటువంటి ఆయన యింటికి వెళ్ళి నోటుబాకీ తీరుస్తారా, లేదా దావా చెయ్యమంటారా?' అని తను ఎలాగ అడగగలడు. అందుకనే నోటు పట్టుకొని వెళ్ళి, ప్రామిసరీ నోటు బాకీ డిమాండుచెయ్యడానికి జంకి సుందర్రావు అశ్రద్ధచేస్తూవుంట.

పైగా బుచ్చిరామయ్యగారు ఇదివరలో కాలదోషం పట్టిన నోట్లుగలవారిని కూడా కబురుపెట్టి, రప్పించి, వారి బాకీని ఆఖరు పైసవరకూ చెల్లించిన ఉదంతాలు అనేకం వున్నాయి. బుచ్చిరామయ్యగారి పరిభాషలో చెప్పాలంటే, 'నోటు చచ్చిపోయిందిగాని, బాకీ చచ్చిపోలేదుగదా,' అని కూడా అనేవాడు.

ఆయన పెద్ద ఆస్తిపరుడు. ఐనప్పటికీ సంసారంగూడా పెద్దదే అవడంవల్ల వ్యవసాయానికి భారీగా పెట్టుబడి గూడా పెట్టవలసిరావడంవల్ల ఆయన అప్పులు చెయ్యవలసివచ్చేది ఆయన అప్పుచేసే విధం గూడా చాలా హుందాగా వుండేది.

బుచ్చిరామయ్యగారికి డబ్బు కావలసివస్తే ఆయన ఎవరినీ స్వయంగా అడిగేవాడు కాదు ఆయన అంతరంగికులచేత ఆయనకు డబ్బు అవసరం కలిగినట్టుగా ముందు కబురుచేసేవారు.

ఋణదాత ఆయనకు అప్పు యివ్వడానికి సుముఖత చూపిస్తేనే ఫలానా టైముకు వచ్చి డబ్బు పట్టుకువెడతానని కబురుచేసి, ఆ ప్రకారం వచ్చి నోటురాసి యిచ్చిడబ్బుపట్టుకువెళ్ళేవాడు ఎవరైనా ఆయనను ఆస్తి తణఖా రాసిఇవ్వమంటే మాత్రం తనమీద నమ్మకంలేక అలా అడిగారు కాబోలునని వాళ్ళ గుమ్మం తొక్కేవాడు గాదు.

అటువంటి బుచ్చిరామయ్యగారు మూడువేల రూపాయలు వుంటే సర్దుబాటు చెయ్యమని ఆయన రెండో కొడుకుని తన దగ్గిరకు పంపించినప్పుడు తన దగ్గర డబ్బులేక, తన భార్య పుట్టింటివారు యిచ్చిన డబ్బు జగదాంబ దగ్గరవుండగా ఆమెను యివ్వమని సుందర్రావు సిఫార్సు చేశాడు బ్యాంకు వడ్డీకన్న ఎక్కువ వడ్డీ వస్తుందన్న ఆశ మనసులో పట్టి లాగుతున్నా, బుచ్చిరామయ్యగారు ఎలాటివారో తెలియక, ఋణగ్రహీతలందరిలాటివారేనేమోనని, అప్పుచేసేటప్పుడు వున్న మంచితనం, అప్పు తీర్చేటప్పుడు కనపడకపోవచ్చునని తలచి అప్పు యివ్వడానికి ఒప్పుకోలేదు జగదాంబ సుందర్రావు దగ్గర డబ్బు సిద్ధంగా వుంటే మూడోమనిషికి తెలియకుండా యిచ్చేవాడే. తన దగ్గర


అప్పట్లో డబ్బు సర్దుబాటుకాలేదనీ, ఐతే కబురుచేస్తాననీ మర్యాదగానే చెప్పి సుందర్రావు తప్పుకొన్నాడు.

మరొక వారం రోజులలో జగదాంబ మేనమామ ఏదో పనిమీద వాళ్ళ వూరు వెళ్ళి బుచ్చిరామయ్యగారి గురించి జగదాంబతో యథాలాపంగా చెప్పాడు — ఆయని చాలా మంచివాడనీ, ఖచ్చిత మైన వాడనీను. జగదాంబ అప్పుడు తనంతట తానే "పోనీ పెద్దవాడు ఎంత అవసరం వుండి కొడుకుని డబ్బుకోసం పంపించాడో, బ్యాంకులోంచి తీసి యిస్తాను. పట్టుకుని వెళ్ళి యిచ్చి నోటు రాయించుకుని రండి," అని సుందర్రావుతో చెప్పింది. ఆ ప్రకారమే సుందర్రావు పట్టుకొనివెళ్ళి మూడువేలూ యిచ్చి నోటు జగదాంబ పేర రాయించు కొని వచ్చాడు. ఐతే జగదాంబ ఒక షరతు పెట్టింది — ఏ సంవత్సరం వడ్డీ ఆ సంవత్సరం ఆఖరుకు యిచ్చివెయ్యా లని. దానికి బుచ్చిరామయ్యగారు అంగీక రించారు. అక్షరాలా అలాగే జరుపుకొ స్తున్నారు. ఇది మూడు సంవత్సరాల నాటి మాట.

ఇప్పుడు ఆ నోటే కాలదోషం పట్ట డానికి నాలుగు రోజుల వ్యవధిలోకి వచ్చింది. జగదాంబ గత రెండేళ్ళుగా ఏ సంవత్సరం వడ్డీ ఆ సంవత్సరం ఆఖరుకి పుచ్చుకొంటున్నా ఆ వడ్డీని నోటుమీద బుచ్చిరామయ్యగారిచేత చెల్లు వ్రాయించుకోనూ లేదు, ఆయన రాస్తా నని అననూ లేదు. ఆయనలో వున్న విశేషం అదే. తనను యితరులు ఎలా నమ్మాలని అనుకుంటాడో అలాగే ఆయనతో వ్యవహరించేవాళ్ళను కూడా ఆయన అలాగే నమ్ముతాడు

జగదాంబ పోరుపడలేక, ఆమెలో భయసందేహాలను పోగొట్టడానికి విధిలేక వర్షం ఆరంభించిన నాలుగో రోజున సుందర్రావు బుచ్చిరామయ్యగారి వూరు బయలుదేరాడు. చూడటానికి కొత్తకోట అట్టే దూరంలేకపోయినా ఆ వూరు వెళ్ళిరావడం పెద్ద యాగం చేసినంత ప్రయాస బస్సులు వున్నవి చాలా తక్కువ, అవైనా వేళకు వచ్చివెళ్ళవు. ఆ తర్వాత నడక. అందులో ఎడతెరిపి లేని వర్షం. సుందర్రావు అయిష్టంగానే బయలుదేరాడు.

జగదాంబ ఏవో నగలు చేయించు కుంటుందనో, అవసరం వుందనో, నోటు యింకా నెల్లాళ్ళకు కాలదోషం పడుతుందనగానే డబ్బు యివ్వమని అడగనందుకు తనను తాను నిందించు కొన్నాడు. బుచ్చిరామయ్యగారు వడ్డీ చెల్లించినప్పుడైనా నోటుమీద చెల్లు పెట్టించుకొనివుంచే తాము కూడా నిజాయితీగా వ్యవహరించినట్టూ వుండును, నోటు కూడా కాలదోషం పడుతుందనే బెంగా వుండకపోనుగదా అని జగదాంబ మీద మనసులోనే విసు




కొక్కున్నాడు. అతి తెలివిగా, గడుసు తనంగా మనం వ్యవహారం చేశామని అనుకొన్న పనులే ఒక్కొక్కప్పుడు ఎదురుతిరిగి మనస్తాపం కలిగిస్తాయో సుందర్రావుకి అవగతమయింది. అసలు యింతకీ బుచ్చిరామయ్యగారివంటి వ్యక్తిని, ముఖాముఖి ఎదుటపడి నోటు మీద చెల్లు వ్రాయమనిగాని, మూడో సంవత్సరం వడ్డీతో సహా అసలు తీర్చమని అడగడం ఎలాగా అన్నదే సుందర్రావు సమస్య.

ముసురువల్ల సుందర్రావు ప్రయాణం విసుగుగానే సాగింది. అతనికి శకునాల మీద నమ్మకంలేకపోయినా బస్సులో అడుగుపెట్టే సమయానికి ఎవరో తుమ్మారు. కొంచెం ఆగి వెడదామనుకున్నాడు. కాని, బస్సు దొరకదేమో, మళ్ళీ యింకో బస్సుకోసం మరోగంట చినుకుల్లో నిలబడి ధ్యానం చెయ్యాలని బయలుదేరాడు. తాను వెళ్ళే పని అవుతుందో, అవదో? తీరా యింత శ్రమపడి పోతే బుచ్చిరామయ్యగారు వూళ్ళో వుంటారా, వుండరా? అని అనుకుంటూనే, శంకిస్తూనే సుందర్రావు కొత్తకోట ఉదయం పదిగంటలకు చేరాడు.

దూరాన్నుంచి చూస్తే బుచ్చిరామయ్యగారి యింటిముందు చాలామంది జనం గుమికూడి వున్నారు. ఇంకా పరిశీలనగా చూస్తే వీధివాకిలిలో పాడె, కుండకూడా సుందర్రావుకి కనుపించాయి. అతని మనసు ఏదో అశుభం జరిగివుంటుందని వూహించింది. ఈ పరిస్థితిలో తాను వారి యింటికి వెళ్ళడమా, మానడమా. ఇంత కష్టపడి, యింత దూరం వచ్చి, తనకు ఎవరిపైననైతే ఎనలేని గౌరవం, గురి వున్నాయో వారు కష్టంలో వున్నారని తెలిసి తప్పుకొని వెళ్ళిపోవడమా? అలా వెళ్ళిపోతే ఆ వేళతోనే కాలదోషం పట్టే ప్రామిసరీ నోటు మాటేమిటి?

ఒకవేళ ఎదరపడితే వారు కష్టంలో వుండగా తాను దానినంతటినీ విస్మరించి, తన వ్యవహారమే ముఖ్యమైనట్లుగా యీ విషయం కదపడమెలాగ? ఈ ప్రశ్నా పరంపరతో, ధర్మసందేహాలతో ఎటూ నిర్ణయించుకోలేకుండానే సుందర్రావు చేరవలసిన యిల్లు చేరుకొన్నాడు అక్కడ బుచ్చిరామయ్యగారి బంధువులూ స్నేహితులూ పనివాళ్ళూ గ్రామస్థులూ చాలామంది వున్నారు అందరి మొహాల్లోనూ దీనత్వం, విషాదం తాండవిస్తున్నాయి. అందరూ ఏదో అమూల్యమైన అలభ్యమైనదానిని పోగొట్టుకొన్నట్టుగా శూన్యంలోకి నిస్తేజంగా చూస్తున్నారు. సుందర్రావు మనసు కొంత ఊహించింది, మరికొంత గ్రహించింది. అతని మనసులో వున్న అనుమానాన్ని నివృత్తి చేసుకొనేందుకు అక్కడ వున్న ఎవరినో అడిగి నిర్ధారణ చేసుకొన్నాడు ఒక్క క్షణంపాటు పిడుగుపడినట్లయింది — ఆ మాట వినగానే, తన చెవులను తనే నమ్మలేకపోయాడు. ఆ యింటిలో మరణించినది బుచ్చిరామయ్యగారే.

బుచ్చిరామయ్యగారిమీద తన అంతరాంతరాలలో అంత ప్రేమ, గౌరవం, భక్తి, ఆప్యాయత, సన్నిహితత్వం గూడుకట్టుకొని ఉన్నాయని సుందర్రావుకి ఆ రోజే తెలిసింది. అశనిపాతంలాంటి ఆ మాట వినగానే తానెవరో, తనది ఏ వూరో, తానక్కడికి ఎందుకు వచ్చాడో వగైరా అవన్నీ కొద్ది క్షణాల పాటు మరచిపోయాడు సుందర్రావు.

ఒక వ్యక్తి తన మంచితనంవల్ల, తన ప్రవర్తనవల్ల, తన ఉదార స్వభావంవల్ల స్వార్థరహిత జీవనంవల్ల ప్రజలను అంతగా ఆకట్టుకొని, వారి ప్రేమ, గౌరవాలకు అంతగా పాత్రుడౌతాడని సుందర్రావు ఎన్నడూ వూహించలేదు ఆకారంలో ఒడ్డూ, పొడవూ వున్న బుచ్చిరామయ్యగారి హుందాతనం ఆయన ప్రతి కదలికలోను ప్రతి చర్యలోను, ప్రతి మాటలోను స్పష్టంగా ఎవరికైనా కనపడుతుంది ఆయనకు గల ఓర్పు, నిగ్రహం, నిదానం, వినయం, నిరాడంబరత సహజ లక్షణాలుగానే కనపడతాయి గాని, ఎబ్బెట్టుగా, తెచ్చిపెట్టుకొన్నవిగా కనపడవు వయస్సులోగాని, ఆస్తిలోగాని, విద్యలోగాని, కులంలోగాని తనకంటె బాగా తక్కువవారిని కూడా తనతో సమానంగా చూపే ఆయన విశాల హృదయం ఎవరినైనా యిట్టే ఆకట్టుకొంటుంది. అటువంటి వ్యక్తి అరుదుగా లక్షలాది వ్యక్తుల్లో ఒకడు వుంటాడు.

బుచ్చిరామయ్యగారితో తనకు మొదట్లో ఎలా పరిచయమైనదో, ఆయనను ఎన్నిసార్లు ఏ ఏ సందర్భాలలో ఎక్కడెక్కడ కలుసుకొన్నదీ, ఆయనపట్ల తనకు గౌరవం ఎలా కలిగినదీ వగైరా విషయాలు ఆలోచిస్తూ సుందర్రావు అలాగే వుండిపోయాడు.




అతనిని ఎవరూ పలకరించలేదు. అతను లోపలికి వెళ్ళి బుచ్చిరామయ్య కొడుకుల్నీ భార్యనూ పరామర్శించుదామనుకునే టంతలో బుచ్చిరామయ్యగారి శవాన్ని లోపలినుంచి సాయంపట్టి పైకి తీసుకు వచ్చి పాడెమీద పడుకోబెట్టారు.

సుందర్రావు అసంకల్పితంగానే బుచ్చిరామయ్య దేహానికి దణ్ణంపెట్టాడు. ఆప్తుల శోకాలాపనలతో అక్కడి వాతావరణం అంతా దుఃఖపూరితమైపోయింది. అందరితో పాటు తనూ బుచ్చిరామయ్యగారి అంతిమయాత్రలో పాల్గొని దహన

కాండ పూర్తయిన తర్వాత సాయంత్రం నాలుగు గంటలకి వారి యింటికి తిరిగి వొచ్చాడు శ్మశానం దగ్గరే బుచ్చి రామయ్యగారి నలుగురు కొడుకుల్నీ సుందర్రావు పరామర్శించి వారికి ధైర్యం చెప్పాడు. అనునయ వాక్యాలు పలికాడు.

సాయంత్రం యింటికి వచ్చాక బుచ్చి రామయ్యగారి భార్యను కూడా కలుసుకొని పరామర్శించాడు, బుచ్చిరామయ్యగారి యింటికి తిరిగివచ్చాక ప్రోనోటుగురించి చెబుదామనుకున్నాడు గాని, అది సమయమూ, సందర్భమూ కాదని, అసలే ఇంటియజమానిని పోగొట్టుకొని గంపెడు దుఃఖంలో వున్నవారితో యీ విషయం కదపడం శభ్యత, సంస్కారం కావని వూరుకొన్నాడు

సుందర్రావు వచ్చేస్తూంటే బుచ్చి రామయ్యగారి పెద్దకొడుకు కృష్ణమూర్తి అతనిని పిలిచి "చూడండి సుందర్రావు గారూ. మా నాన్నగారు మీకు ప్రోనోటు డబ్బు యివ్వాలనుడుంటాను. ఆ నోటు బాకీగురించి మీరేమీ గాభరా పడకండి. యీ కర్మకాండ అంతా అయిపోయాక, మేము అన్నీ సర్దుకొని మీకు ఏమి యివ్వాలో అది పూర్తిగా యిచ్చేస్తాము. నోటు మానాన్నగారు రాసినా, ఆయన పోయినా, నోటు కాలదోషం పట్టినా, ఆ బాకీ తీర్చే బాధ్యత నాది. దావామాత్రం చెయ్యకండి, వ్యవధి యివ్వండి" అన్నాడు. కృష్ణమూర్తి అన్నమాటలకి సుందర్రావు నిశ్చేష్టుడైపోయాడు. తాను యీ వ్యవహారం ఎలాగ కదపడమా, కదపడకుండా ఎలా వెళ్ళిపోవడమా అన్న యిరకాటంలో వుండగా, తన మనసులోని మాట కృష్ణమూర్తి కనిపెట్టి నట్టుగా చెప్పడంతో ఆశ్చర్యపోయి, "అలాగే బాబూ, యీ నోటు యీ వేళతో కాలదోషం పట్టిందిఁలోగడ మీరు యిచ్చిన వడ్డీ మీ నాన్నగారిచేత చెల్లు రాయించుకుందామని వచ్చాను. తీరా వచ్చేసరికి ఆయన చనిపోవడం, ఆయన అంతిమ దర్శనం దొరకడం జరిగాయి. ఈ పరిస్థితిలో యీ విషయం మీతో ఏమి మాట్లాడనని వెళ్ళిపోతున్నాను. ఈలోగా మీరే పలకరించి విషయం కదిపారు. ఇదిగో యీ నోటూ మీదగ్గరే వుంచండి. మీకు ఎప్పుడు వీలయితే అప్పుడు పరిష్కారం చెయ్యండి"అంటూ సుందర్రావు ఆ నోటూ యిచ్చివేశాడు. "ఎందుకండీ కర్మకాండ పూర్తయిన నెల, తప్పితే మరో పదిహేను రోజుల్లో తీర్చివేస్తాము" అంటూ కృష్ణమూర్తి నోటు తీసుకొన్నాడు.

అప్పటి పరిస్థితుల్లో సుందర్రావు అంతకంటే చేయగలిగిందేమీ లేదు. ఆ నోటూ వ్రాసినాయన చనిపోయాడు. ఆ నోటు ఆ రోజుతో కాలదోషం పడుతోంది. బుచ్చి రామయ్యగారి కొడుకుల చేత వేరొక కొత్త నోటు వ్రాయమని అడిగే సమయం కాదు. ఎదుటివారి

కష్టాలు, బాధలు, యిబ్బందులతో సంబంధంలేని వ్యక్తి, కేవలమూ అనుక్షణమూ ప్రధానంగా ఎంచే వ్యక్తి మాత్రమే ఆ సమయంలో నోటు వ్రాసి యివ్వమని అడగగలడు. బుచ్చిరామయ్యగారి మీద, ఆయన జీవన విధానంమీద, వారి కుటుంబంమీద ఎనలేని ప్రేమ, గౌరవాలువున్న సుందర్రావు లాటివాడు తండ్రి పోయిన రోజునే ఆ తరుణంలోనే ఖచ్చితంగా, వ్యవహార పరంగా కొత్త నోటు వ్రాసి యివ్వమని కొడుకులను ఎలా అడగగలడు!

ఇంటికివెళ్ళి జరిగినదంతా జగదాంబతో సుందర్రావు చెప్పాడు. తాను ఏ పరిస్థితులలో తిరిగి నోటు వ్రాయించుకోకుండా వచ్చినదీ ఆమెకు జాలికలిగే విధంగా చెప్పాడు.

కాని జగదాంబకు జాలి కలుగలేదు, సరికదా భర్త అసమర్థతకు, అప్రయోజకత్వానికి ఆమెకు అతనిమీద అసహ్యం వేసింది. ఆమె సుందర్రావుని చూసిన చూపులో అసహ్యాన్ని ఎంత ప్రస్ఫుటంగా ప్రకటించాలో అంత స్ఫుటంగా, సహజంగా ప్రకటించింది.

"వాళ్ళ చావులూ, ఏడుపులూ ఎవడిక్కావాలి? వాళ్ళు ఎంత మంచివాళ్ళూ, గొప్పవాళ్ళూ అయితే ఎవరికి కావాలి? నా డబ్బు నాకు కావాలి. మిమ్మల్ని పదిహేనురోజులనుంచీ ఆ వూరు వెళ్ళి డబ్బు వసూలుచేసుకు రమ్మనమని పోరుతూవుంటే కదిలారుగారు. తీరా ఆయన చచ్చిపోయే రోజుకే మీకు ప్రయాణానికి ముహూర్తం కుదిరింది. 'నోటు చచ్చిపోయినా, నేను చావలేదుగా' అని ఆ బుచ్చిరామయ్యగారు అంటూ వుండేవారని, ఆయన విజాయితీ తలుచుకొని మురిసిపోతూ వుండేవారు. ఇప్పుడేమయింది. ఇప్పుడు నోటూ చచ్చింది, ఆయనా చచ్చాడు. ఐతే యిక నా డబ్బు పోయినట్టేనా? ఇప్పుడు నా డబ్బుకెవరు జవాబుదారీ? మీ మగాళ్ళకి మంచివాడనే పేరు వస్తే చాలు, ఏది ఎలాగ తగలబడిపోయినా మీ కక్కర లేదు. మీరు మరో రెండురోజులు ఆ వూళ్ళోనేవుండిపోయి, సత్యాగ్రహమైనా చేసి, ఆయన కొడుకులచేత ఎందుకు నోటు రాయించుకుని రాలేదు? అది నా డబ్బు గాబట్టి మీకు ఇంత అలక్ష్యమా. మీరు నాకు కావలసిన డబ్బు యివ్వలేరు. నా డబ్బు మాత్రం ధారాదత్తం చేసెయ్యగలరు." అంటూ ఆవిడ సహజ వాగ్ధోరణిలో ఏకబిగిని ఏకరువు పెట్టి "ఇంతకీ నా నోటేదీ?" అని అడిగింది.

"ఆ నోటు ఎక్కడున్నా ఒకటే; వాళ్ళ పెద్దబ్బాయికి యిచ్చేశాను" అన్నాడు. ఈమాట విని జగదాంబ మరీ రెచ్చిపోయింది. సుందర్రావు చేతగానితనాన్ని, తెలివితక్కువను, వ్యవహార జ్ఞాన శూన్యతనూ చక్కగా ప్రస్ఫుటమయ్యేలాగ తెగనాడింది.

"ఆ నోటు డబ్బు నాది కాబట్టి మీరంత తేలికగా యిచ్చేసి రాగలిగారు, అదే నీ డబ్బయితే ఆయన కొడుకుల చేత కొత్త నోటు రాయించుకోకుండా వచ్చేస్తారా?" అన్నది జగదాంబ.

"ఆ సమయంలో నా డబ్బు నీ డబ్బు అన్న ప్రసక్తి లేదు. వాళ్ళు ఎటువంటి ఆపదలోవున్నారో, ఆ సమయంలో డబ్బుకే ప్రాధాన్యత వున్నదో, మానవత్వానికి, సహనానికి, జాలికి ప్రాధాన్యత వున్నదో కాస్త నిదానంగా ఆలోచించు. ఐనా ఆ కుటుంబం ఎటువంటిది? వారి నిజాయితీ ఏమిటి? ఇవన్నీ తెలిసివున్న వాడినికూడా వాళ్ళు పుట్టెడు దుఃఖంలో వుండే విశ్వామిత్రుడు హరిశ్చంద్రుణ్ని నిలబెట్టినట్టు నిలబెట్టి 'నా బాకీ మాటేమిటి?' అని అడగమంటావా? పరిస్థితి, సందర్భం అర్థంచేసుకొని మాట్లాడు. డబ్బుకి వున్న విలువ పరిమితం. నీ మూడువేల రూపాయలకు అంతే విలువ వున్నది, గాని అంతకుమించి విలువ లేదు నిజాయితీ ఐన మనిషి విలువకు పరిమితం లేదు. మనిషి మాటకు నువ్వు విలువ కట్టలేవు: నీకు తెలియదు. కృష్ణమూర్తి చెప్పినట్టుగా నీ డబ్బు అతను యివ్వకపోతే ఆనాటికి అయిన వడ్డీతోసహా ఆ డబ్బు నేనిస్తాను, సరేనా" అని ఆ విషయాన్ని అక్కడికి, అప్పటికి ముగింపుచేశాడు సుందర్రావు ఆ పూట వాళ్ళిద్దరూ వంట వండుకోలేదు. భోజనం చెయ్యలేదు. మరో మూడు రోజులు మాట్లాడుకోలేదు.

కృష్ణమూర్తి పెట్టిన గడువు అయిపోయి మరో పదిహేను రోజులుగూడా గడిచిపోయింది. అతను డబ్బు పట్టుకొచ్చి యివ్వలేదు సరికదా కొత్త నోటు అయినా వ్రాసి యివ్వలేదు. సుందర్రావు కృష్ణమూర్తికి జ్ఞాపకం చేస్తూ కార్డు వ్రాద్దామనుకొన్నాడు గాని, అంతవరకూ ఓర్పుగా, హుందాగా ప్రవర్తించి ఇంతలో ఎందుకు తొందరపడాలని వూరుకొన్నాడు.

బుచ్చిరామయ్యగారు చనిపోయి రెండోనెల దగ్గరవుతుండగా ఒకరోజున సుందర్రావు జగదాంబను పిలిచి, ఆమెకు అసలు, వడ్డీ పూర్తిగా యిచ్చివేసి, కృష్ణమూర్తి తెచ్చి యిచ్చినట్టుగా చెప్పాడు. అప్పుడు జగదాంబ మొహం విప్పారింది. తన డబ్బు తనకు చేరిందనే తృప్తి కలిగినా, ఆ డబ్బు తన చేతికి వస్తుందో రాదోనని తాను పొందిన మానసిక ఆవేదన తప్పలేదుకదా అనే భావం, తన భర్త నమ్మినట్లుగానే అవతలివారి నిజాయితీ ఋజువయిందనే బాధ సమ్మిళితమైన చూపు ఒకటి విసరి ఆ డబ్బు అందుకొంది.

మరొక పదిహేను రోజులకు సుందర్రావు వీధిలోకి పనిమీద వెళ్ళి సాయంత్రం యింటికి చేరుకోగానే జగదాంబ పెల్లుబికి వస్తున్న నవ్వును



ఆపుకుంటూ తలుపు తీసింది. ఎక్కువ వెలుతురులోంచి, తక్కువ వెలుతురువున్న గదిలో ప్రవేశించిన సుందర్రావు ఆమె నవ్వును గమనించ లేదు. కాళ్ళు కడుక్కొని తాపీగా పడక కుర్చీలో కూర్చొన్న సుందర్రావు కాలక్షేపానికి ఏదో వారపత్రిక తీసి టేబిల్‌లైటు వెలిగించాడు. ప్రక్కనే మరో కుర్చీలో కూర్చున్న జగదాంబ సంభాషణ ప్రారంభిస్తూ "యీవాళ మధ్యాహ్నం కృష్ణమూర్తిగారు వచ్చా రండీ" అన్నది. సుందర్రావు పరధ్యాన్నంగా "ఏ కృష్ణమూర్తి" అన్నాడు.

"అదే, బుచ్చిరామయ్యగారి అబ్బాయి"

"ఆహా, అలాగా, ఏమంటాడూ? మళ్ళీ అప్పు కావాలంటాడా?" అన్నాడు సుందర్రావు గంభీరంగా.

"మళ్ళీ అప్పుకావాలనలేదు" అని ఆగి నవ్వుతూ "నా నోటు బాకీ మళ్ళీ పూర్తిగా ఇచ్చి వెళ్ళాడు. ఇదిగో,"

అంటూ జేబురుమాలుని కట్టిన డబ్బు తీసి చూపించింది.

సుందర్రావు ఆశ్చర్యపోయి, ఆశ్చర్యాన్ని పైకి కనబడకుండా నిగ్రహించుకునే ప్రయత్నం చేస్తూ, "చూశావా. చచ్చిపోయిన నోటుకి, వాళ్ళకి వాపసుచేసిన నోటుకి, ఎంత నిజాయితీగా డబ్బు పట్టుకొని వచ్చి యిచ్చాడో. ఇప్పుడైనా ఒప్పుకుంటావా వాళ్ళ నిజాయితీ" అన్నాడు సుందర్రావు.

"వాళ్ళ నిజాయితీ ఐనవాళ్ళే. వాళ్ళు నిజాయితీ ఐనవాళ్ళుగా బట్టే నాకు రెట్టింపు డబ్బు దక్కింది. పాపం వాళ్ళ నిజాయితీని మరో విధంగా నిరూపించలేక మీ డబ్బుకూడా పోగొట్టుకున్నారు." అన్నది జగదాంబ నవ్వుతూ.

"పోగొట్టుకోవడమేమిటి? నా డబ్బు నాకివ్వవా ఏమిటి కొంపదీసి. మన మిప్పుడు నిజాయితీ గురించి పరిశోధిస్తున్నాము. ఇతర్లలో నిజాయితీ వుండాలని కోరితే మనలో వున్న నిజాయితీ ఏమిటో చూపించాలి" అన్నాడు సుందర్రావుకూడా నవ్వుతూ.

"గట్టివారే, ఐతే తీసుకోండి" అంటూ జగదాంబ జేబురూమాలులో వున్న డబ్బు సుందర్రావు చేతిలో పెట్టి ఇలా అన్నది.

"అది సరే, మన డబ్బు మనకు చేరిందనుకోండి. బుచ్చిరామయ్యగారి కుటుంబంలోని వారు నిజాయితీపరులని నన్ను నమ్మించడానికి మీ రెందుకు అబద్ధమాడారు? ఇందులో మన నిజాయితీ ఎక్కడుంది?"

"ఓహో! అదా నీ ధర్మసందేహం. ఐతే విను. నేను మొదటినుంచీ బుచ్చిరామయ్యగారు, ఆయన కుటుంబంలోని వారు చాలా నమ్మదగ్గ వ్యక్తులని నీకు చెబుతున్నాను గాని, నేను ఖచ్చితమైన వాణ్ణని నీతో అనలేదు. అసలు యీ వ్యవహారంలో నా ప్రసక్తే లేదు. నువ్వు నీడబ్బు నా తెలివితక్కువ వల్ల, మంచితనంవల్ల లేదా నీ భాషలో చేతగానితనం వల్ల పోగొట్టానని బాధపడుతుంటే ఆ బాధ తగ్గించడానికి చిన్న అబద్ధం ఆడవలసి వచ్చింది. నీ డబ్బు వాళ్ళు ఏనాటికైనా తెచ్చి ఇస్తారనే నమ్మకం వుండడం వల్లనే అందాకా నా డబ్బుని అడ్డం పెట్టాను. ఐనా వారిజాక్షులందు, వైవాహికములందు, ప్రాణ, విత్త, మాన భంగమందు ఆడి బొంకవచ్చు' అని మన శాస్త్రాల్లో వున్నది గదా" అన్నాడు సుందర్రావు.

సుందర్రావు సమాధానంతో జగదాంబ తృప్తిపడింది